క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి



నందిపేట్‌: మండలంలోని కుద్వాన్‌పూర్‌లో కొందరు గ్రామానికి చెందిన భూమిని కబ్జాకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 902, 903 సర్వే నంబరులో ఉన్న గ్రామానికి చెందిన భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి గ్రామానికి అప్పజెప్పాలని కోరారు.

విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



మోర్తాడ్‌: ఏర్గట్ల పెద్దగుట్ట వద్ద పంచముఖి హనుమాన్‌ విగ్రహ ఏర్పాటుకు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ కమల స్థలాన్ని శనివారం పరిశీలించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేపట్టారు. ఆమె వెంట జిల్లా కాంగ్రెస్‌ కమిటీ ఉపాధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్‌, నాయకులు ఉన్నారు.

విరాళం అందజేత

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి స్థానిక సరసం గంగారెడ్డి చారిటబుల్‌ ట్రస్ట్‌ రూ. ఒక లక్ష విరాళం అందజేసింది. విరాళం చెక్కును ట్రస్ట్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ రాజేశ్వర్‌, చైర్మన్‌ సరసం చిన్నారెడ్డి వీడీసీ సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సోమ దశరథ్‌, కొమ్ముల రవీందర్‌, పన్నాల రాజేశ్వర్‌, బద్దం దన్‌రెడ్డి, బద్దం నాగేశ్‌, మోహన్‌, చింతకుంట శ్రీను, మల్లయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ రాలేదని పత్రాలు అందజేత

ఎడపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో రూ.2 లక్షల రుణమాఫీ రాలేదని మండలంలోని రైతులు వ్యవసాయాధికారులకు సంబంధిత పత్రాలను శనివారం అందజేశారు. శనివారం రైతు రుణమాఫీ జాబితాను మండలంలోని గ్రామాల వారీగా విడుదల చేశారు. రుణామాఫీ కానీ రైతులు బ్యాంక్‌ అకౌంట్‌, పాస్‌బుక్‌, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను అధికారులకు అందించారు. ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతాలలో ఉన్న తప్పులను చూసి సరి చేయించుకోవాలని రైతులకు సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

నందిపేట్‌: మండలంలోని పీహెచ్‌సీ పరిధిలోని సీహెచ్‌ కొండూర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 63 మందికి పరీక్షలు నిర్వహించి, 21 మందికి రక్తనమూనాలను సేకరించినట్లు వైద్యాధికారి ప్రవీణ్‌ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దేవన్న, సూపర్‌వైజర్‌ సురేందర్‌, ఎంఎల్‌హెచ్‌పీ నిహారిక, ఏఎన్‌ఎం సుల్తానా బేగం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పెర్కిట్‌: ఆర్మూర్‌తో పాటు ఆలూర్‌ మండలంలో బాధిత కుటుంబాలను కాంగ్రెస్‌ పార్టీ ఆర్మూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట గ్రంథాలయ మాజీ చైర్మన్‌ మార చంద్రమోహన్‌, సాయారెడ్డి, ముక్కెర విజయ్‌ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కమ్మర్‌పల్లి: బడి మధ్యలో మానివేసిన విద్యార్థులకు ఓపెన్‌ స్కూల్‌ ద్వారా పదో తరగతి, ఇంటర్‌ చదువుకోవాలనుకునే వారికి 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కమ్మర్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీసాయన్న శనివారం పేర్కొన్నారు. పదో తరగతిలో ప్రవేశం కోసం పాత పాఠశాలకు సంబంధించి టీసీ, బోనఫైడ్‌, బర్త్‌ సర్టిఫికేట్‌, ఆధార్‌, కుల ధృవీకరణ పత్రం మూడు సెట్ల జిరాక్స్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలతో పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఇంటర్‌ ప్రవేశం కోసం పదో తరగతి మెమో, టీసీ, కుల ధృవీకరణ పత్రం రెండు సెట్ల జిరాక్స్‌ కాపీలతో రెండు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలతో పాఠశాలలో సంప్రదించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్‌ 29 కాగా, అపరాధ రుసుముతో అక్టోబర్‌ 3 వరకు దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌ఎం సూచించారు.

వైద్యుల నిరసన



ఇందల్వాయిలో నిరసన తెలుపుతున్న వైద్యులు



బోధన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



మోర్తాడ్‌లో వైద్య సిబ్బంది

సాక్షి, నెట్‌వర్క్‌: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆర్మూర్‌, బాల్కొండ, బోధన్‌ నియోజకవర్గాల్లోని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. శనివారం ఓపీ సేవలను వైద్యులు నిలిపివేశారు. అత్యవసన సేవలను మాత్రం కొనసాగించారు. హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలంటు పలు చోట్ల ధర్నా చేపట్టి నినాదాలు చేశారు. ఆస్పత్రుల ఎదుట వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.



వర్నిలో..



ఎడపల్లిలో



ఆర్మూర్‌లో వైద్యులు



బోధన్‌లో పీఎంపీలు



రెంజల్‌లో..



రుద్రూర్‌లో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

తగిన జాగ్రత్తలతో లాభసాటిగా పశు పోషణ



మాట్లాడుతున్న ఏడీ గంగాధరయ్య

కమ్మర్‌పల్లి: మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది పాడి పశువులను కొనుగోలు చేసే రైతులు తగిన జాగ్రత్తలు పాటించి పశు పోషణను లాభసాటిగా చేపట్టాలని పశుసంవర్ధక శాఖ ఏడీ గంగాధరయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పాడి రైతుల అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పాడి రైతులకు గేదెలు, ఆవులు, కోళ్ల పెంపకం దారులకు రుణాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌ పశువైద్యాధికారులు రాజశేఖర్‌రావు, గౌతమ్‌ రాజ్‌, ఏపీఎం కుంట గంగాధర్‌, సీసీలు భలేరావు రవికుమార్‌ వర్ధం శ్రీనివాస్‌, అలేఖ్య, సిబ్బంది ధనలక్ష్మి పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్‌ ధరించాలి



ఆలూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌వో



వీరన్నగుట్టలో అవగాహన కల్పిస్తున్న సీఐ

ఆర్మూర్‌టౌన్‌: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని ఎస్‌హెచ్‌వో రవికుమార్‌ అన్నారు. మండలంలోని ఆలూర్‌లో ప్రజలకు, వాహనదారులకు నూతన నిబంధనలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు భరోసా

రెంజల్‌: వాహనదారులు హెల్మెట్‌ ధరించడం వల్ల ప్రాణాలకు భరోసా ఉంటుందని బోధన్‌ రూరల్‌ సీఐ నరేశ్‌ పేర్కొన్నారు. మండలంలోని వీరన్నగుట్టలో శనివారం హెల్మెట్‌పై స్థానికులకు అవగాహన కల్పించారు. హెల్మెట్‌ లేక పోవడం వల్ల గతంలో జరిగిన ప్రాణనష్టం ఘటనలను స్థానికులకు వివరించారు. ప్రభుత్వం ట్రాఫిక్‌ నిబంధనలను కఠినతరం చేసిందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో రెంజల్‌ ఎస్సై సాయన్న, మాజీ సర్పంచ్‌ వినోద్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని ఆందోళన

నవీపేట: మండలంలోని జన్నేపల్లి గ్రామంలోని కెనరా బ్యాంక్‌ ఎదుట బీజేపీ నాయకులు రుణమాఫీ ఎందుకు కాలేదని శనివారం ఆందోళన చేపట్టారు. బ్యాంక్‌ మేనేజర్‌ను కలిసి రుణమాఫీపై వివరాలు అడిగారు. అందరికీ రుణమాఫీ కాలేదని సమాధానమివ్వడంతో బ్యాంక్‌ ఎదుట నినాదాలు చేశారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వడం లేదని, రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు ద్యాగసరిన్‌ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌, ఆదినాథ్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏఈవోల బదిలీలు

రుద్రూర్‌: కోటగిరి, రుద్రూర్‌ మండలాలకు చెందిన వ్యవసాయ మండలాల విస్తీర్ణాధికారులు బదిలీ అయ్యారు. కోటగిరి మండలం కొత్తపల్లి ఏఈవో గౌస్‌ రాంపూర్‌కు బదిలీ కాగా, మోస్రాకు చెందిన ప్రశాంత్‌ కొత్తపల్లికి బదిలీపై వచ్చారు. జక్రాన్‌పల్లి నుంచి రుద్రూర్‌కు వెంకటేశ్‌ రాగా, మోస్రా ఏఈవోగా సప్తగిరి వచ్చినట్లు వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌రావు, నగేశ్‌ రెడ్డి పేర్కొన్నారు.

నవీపేట ఏవోగా నవీన్‌కుమార్‌

నవీపేట: నవీపేట ఏవోఓగా నవీన్‌కుమార్‌ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు విధులు నిర్వహించిన సురేష్‌గౌడ్‌ నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు. కామారెడ్డి జిల్లా జుక్కల్‌ నుంచి సిరిగాద నవీన్‌ కుమార్‌ నవీపేటకు వచ్చారు. రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు.

బాల్కొండ ఏవోగా బద్దం లావణ్య

బాల్కొండ: మండల వ్యవసాయ అధికారిగా బద్దం లావణ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు విధులు నిర్వర్తించిన మహేందర్‌రెడ్డి బదిలీపై నిజామాబాద్‌ అర్బన్‌కు వెళ్లారు.

పాఠశాలల్లో రాఖీ వేడుకలు



మోతె హైస్కూలులో బాలురకు రాఖీ కడుతున్న బాలికలు



అంక్సాపూర్‌ హైస్కూలులో..



భీమ్‌గల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో..

వేల్పూర్‌/ నందిపేట్‌/ మోర్తాడ్‌/ భీమ్‌గల్‌/ బోధన్‌ టౌన్‌: వేల్పూర్‌ మండలంలోని మండలం మోతె, అంక్సాపూర్‌ హైస్కూళ్లలో విద్యార్థులు రాఖీ పండుగను శనివారం నిర్వహించారు. బాలికలు బాలురకు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టారు. నందిపేట మండల కేంద్రంలోని నియో లిటిల్‌ ఫ్లవర్‌ పాఠశాల విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌, ఫైర్‌ స్టేషన్‌, పోస్టాఫీస్‌, జీపీ సిబ్బందికి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏర్గట్ల ఉన్నత పాఠశాలలో రాఖీపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ప్రముఖ వక్త ప్రదీప్‌ పాల్గొని విద్యార్థి దశలోనే దేశభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. భీమ్‌గల్‌ మండలంలోని జిల్లా పరిషత్‌ గర్ల్స్‌ హైస్కూల్‌ రక్షాబంధన్‌ కార్యక్రమాన్ని చేపట్టారు.

నేడు టీటీడీలో రక్షాబంధన్‌

బోధన్‌టౌన్‌: రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ ఆధ్వర్యంలో ఆదివారం రక్షా బంధన్‌ మహోత్సవ కార్యక్రమాన్ని పట్టణంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు నగర సంచాలక్‌ గణేశ్‌రావు కులకర్ణి శనివారం పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు.



ఏర్గట్లలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



నందిపేటలో అగ్నిమాపక సిబ్బందికి రాఖీ కడుతున్న విద్యార్థినులు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

మాక్లూర్‌: మండలంలోని గంగరమంద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం పాఠశాల చైర్మన్‌ కాలేవార్‌ రేవతి దుస్తులను పంపిణీ చేశారు. అలాగే తల్లితండ్రులతో సమావేశం నిర్వహించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. రానున్న రోజుల్లో పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధర, ఉపాధ్యాయుడు జమీల్‌, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో నోట్‌బుక్స్‌..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక చింత ప్రదీప్‌ కుమార్‌ తన తండ్రి బలరాం జ్ఞాపకార్థంగా నోట్‌బుక్స్‌ను ఎంఈవో ఆంధ్రయ్య చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌, సీఆర్పీలు అంజయ్య, రాజేశ్‌, లలిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సమస్యలను పరిష్కరించాలి

రుద్రూర్‌: చిరుజల్లులకే రుద్రూర్‌ బస్టాండ్‌ పరిసరాలు బురదమయంగా మారుతోందని దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్‌ అన్నారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి బస్టాండ్‌ ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిబాబా, రాజం తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బోధన్‌టౌన్‌: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులో ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేయడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాలీలో నాయకులు సుధాకర్‌ చారి బాలరాజు, మాసిని వినోద్‌, రామరాజు, శ్రీనివాస్‌, పసులోటి గోపికిషన్‌, రవిశంకర్‌ గౌడ్‌, పులి సాయిలు, చింటు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌ స్ఫూర్తి ప్రదాత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గౌడ కులస్తులు



మాట్లాడుతున్న మోత్కూర్‌ లింగాగౌడ్‌

నందిపేట్‌: కల్లుగీత కార్మికుల కోసం అహర్నిశలు పోరాడిన సామాజిక విప్లవ పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్‌ గౌడ కులస్తులకు స్ఫూర్తి ప్రదాత అని రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం సలహాదారుడు పెద్ది వెంకట్రాములు అన్నారు. మండల కేంద్రంలోని గౌడ సంఘంలో శనివారం అమరుల యాదిలో గౌడ గీతన్నల చైతన్యయాత్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత వృత్తిలో సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్య పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలుగౌడ్‌, శ్రీరామ్‌గౌడ్‌, నాందేవ్‌గౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, భూమరాజ్‌గౌడ్‌, ఎల్లాగౌడ్‌, అశోక్‌గౌడ్‌, లక్ష్మీనారాయణగౌడ్‌, కృష్ణగౌడ్‌, రమేశ్‌గౌడ్‌, చిన్నాగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్‌ జయంతిని ఘనంగా నిర్వహించాలి

ఆర్మూర్‌టౌన్‌: ప్రతి గ్రామంలో సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ జయంతిని ఘనంగా మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌, కాంగ్రెస్‌ నాయకుడు మోత్కూర్‌ లింగాగౌడ్‌ పిలుపునిచ్చారు. ఆర్మూర్‌ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సర్దార్‌ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను అధికారంగా జరపాలని ప్రకటించిందన్నారు. గౌడ కులస్తులు పార్టీలకు అతీతంగా ఒకే వేదికపై రావాలన్నారు. నాయకులు జనార్దన్‌గౌడ్‌, శంకర్‌గౌడ్‌, రాజేందర్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ విజయవంతం

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగ ఆర్మూర్‌, బాల్కొండ, బోధన్‌ నియోజకవర్గాల్లో హిందూ సంఘాలు ఇచ్చిన బంద్‌ విజయవంతమైంది. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌ పాటించారు. ఉదయం నుంచే వ్యాపార, వాణిజ్య సముదాయలు మూసి ఉంచారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు బంద్‌ పాటించాయి. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. పలుచోట్ల బలవంతంగా బంద్‌ చేయిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని సాయంత్రం విడిచిపెట్టారు.

– సాక్షి, నెట్‌వర్క్‌



ఆర్మూర్‌లో మూసి ఉంచిన దుకాణాలు



ఎడపల్లిలో..



కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో..



బాల్కొండలో మూసి ఉన్న దుకాణాలు

ఆధ్యాత్మికం

■ **వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన**



రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలోని శ్రీహన్మాన్‌ మందిరంలో శనివారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వేద బ్రాహ్మణులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాలరాజ్‌, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో పైడి ఎల్లారెడ్డి చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ ప్లాంట్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ గంగాధర్‌ దేశాయ్‌, డీసీసీబీ మాజీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు శంకర్‌ పటేల్‌, మాజీ సర్పంచ్‌ బీర్కూర్‌ గంగాధర్‌, బర్ల గంగారాం, పత్తి లక్ష్మణ్‌, ప్రముఖ వ్యాపారి విఠల్‌, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

■ **మారుతి మందిరంలో పూజలు**

బోధన్‌రూరల్‌: పట్టణంలోని మారుతి మందిరంలో శ్రావణ మాస శనివారం పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రధాన అర్చకులు ప్రవీణ్‌ మహరాజ్‌ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్‌మహరాజ్‌, గంగుల జీవన్‌, ఈవో రవీందర్‌ గుప్తా, భక్తులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్‌



పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (ఆర్మూర్‌)

స్క్రీన్‌-1 –	స్త్రీట్‌-2(హిందీ) - 12.45, 4.00, 7.15 ఆయ్‌ (తెలుగు) -10.30
స్క్రీన్‌-2 –	మిస్టర్‌ బచ్చన్‌ (తెలుగు) - 9.00, 12.25, 03.50, 7.15, 10.40
స్క్రీన్‌-3 –	తంగలాన్‌ (తెలుగు) - 11.10, 5.45, 9.05 స్త్రీట్‌-2(హిందీ) - 2.30
స్క్రీన్‌-4 –	డబుల్‌ ఇస్మార్ట్‌ (తెలుగు) - 09.10, 12.35, 4.00, 7.25, 10.50

నిజామాబాద్‌ నగరంలో..

ఉషా ప్రసాద్‌ మల్టీప్లెక్స్‌ (గీతా ఏషియన్‌)

స్క్రీన్‌-1	డబుల్‌ ఇస్మార్ట్‌(తెలుగు)-10.25, 4.30,10.35 మిస్టర్‌ బచ్చన్‌(తెలుగు)-1.30,7.35
స్క్రీన్‌-2	స్త్రీ-2(హిందీ)- 10.30 తంగలాన్‌(తెలుగు)-1.30,7.35 ఆయ్‌(తెలుగు)-4.35,10.35
స్క్రీన్‌-3	మిస్టర్‌ బచ్చన్‌(తెలుగు)- 10.20,10.40 డబుల్‌ ఇస్మార్ట్‌ (తెలుగు)-1.25,7.30 స్త్రీ-2(హిందీ)- 4.30

పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (వేణు మాల్‌)

స్క్రీన్‌-1	డబుల్‌ ఇస్మార్ట్‌(తెలుగు)-9.00,7.05 మిస్టర్‌ బచ్చన్‌(తెలుగు)-12.25,10.30 స్త్రీ-2(హిందీ)-3.50
స్క్రీన్‌-2	మిస్టర్‌ బచ్చన్‌(తెలుగు)-9.10,7.15 డబుల్‌ ఇస్మార్ట్‌(తెలుగు)-12.35,10.40 కమిటీ కుర్రోళ్ళు(తెలుగు)- 4.00
స్క్రీన్‌-3	స్త్రీ-2(హిందీ)-9.50,1.05,10.40 ఖేల్‌ ఖేల్‌ మెయిన్‌(హిందీ)- 4.20 తంగలాన్‌(తెలుగు)-7.20
స్క్రీన్‌-4	తంగలాన్‌(తెలుగు)-9.30, 12.50,4.10 ఆయ్‌(తెలుగు)-7.30 వేదా(హిందీ)- 10.35
దేవి	కమిటీ కుర్రోళ్ళు - 11.15 , 2.15 ఆయ్‌ (తెలుగు)-6.15,9.15
నటరాజ్‌	స్త్రీ-2(హిందీ)
విజయ్‌	మిస్టర్‌ బచ్చన్‌(తెలుగు)
లలితామహాల్‌	డబుల్‌ఇస్మార్ట్‌(తెలుగు)

మాంసం ధరలు

చికెన్‌	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్‌	140
		లైవ్‌	100
స్కిన్‌లెస్‌	180	మటన్‌	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్‌	73,200	వెండి (కిలో)	86,800
22 క్యారెట్స్‌	67,525		

– నిజామాబాద్‌ బిజినెస్‌